# శాయిరీ ★

'కర్షక్'

అసలు ఈ శాయిరీ అంటే జేడిమర్క. యే మహరాజు పెట్టిండో కాని మా కొంపలు నిలువునా ఆరుస్తుండది. ఒక్కసారి దాంట్లో యెవడన్నా చిక్కుకున్నాడంటే కొంపారినట్టె. ఇట్టా యెన్నెన్నో కొంప లారినయ్.

మూడేండ్ల కింద మావూళ్లో పశువుల రోగాలొచ్చినయి. బలేబలే యెద్లు గుట్టల్లాగ కూలిపోయినయి. మాంచి యేసంగి దుక్కుల రోజులు. అరక యెనకపడితే కార్తె దాటిపోద్దని గబగబా దున్నుతావుండం. నా ఆవుకు కూడ రోగం తగిలింది. యేమావు భలేది. తొలిచూలు యీతకు కుంచెడుపాలంటే లెక్కలేకుండా యిచ్చింది. పొద్దున్నే అరకకడితే యిడిసే యేల్లదాకా, ముల్లుకర్ర సంకబెట్టుకొని దున్నాల్సిందే. యెంత మొనగాడైనా దాపటి దాన్ని తూగిరానిచ్చేది కాదు. నిలువు కొమ్ములు, కలిమే తోక. యెల్లటి పసరం, చూడకండ్లుండే యిగావు. పొద్దుకూకే దాక మేసి వచ్చింది. సందకాడ కాసేపు గురుకు గురుకు మంది. ఆ సప్పుడినంగనే నా పెద్ద గుండె పగిలిపోయింది. పిచ్చిలేసినోడిలాగా, ఆరికాడికి - యీరికాడికీ వురుకులాడినా కాని యేం లాభం? బతుకుద్దిగనుకనా? తుపాకిదెబ్బకైనా తిరుగుండదికాని, ఆరోగానికి తిరుగులేదు. బల్ బల్ తెల్లవారేవరకు గాండ్రు గాండ్రుమని అరిసి యెగిరిపడి సచ్చింది.

అయ్యాల పొద్దస్తమానం మా ఆడమనిసి నోట్లో నీళ్లుపోయలేదు. యింక అరకసాగే వుపాయంలేదు. మాదిగోడితో ఆవును యెత్తుకపొమ్మని చెప్పి, ఆవజాన్నే మా బావ దగ్గరికి గుళ్ళపూడిపోయిన. ఈ సంగతి యిని శానా చిన్నబోయిండు. యేదో పేదోడు చెడిపోతాడు గదా అని యెక్కువవున్న దున్నపోతును తోలుకపోయి అరక సాగకట్టుకోమన్నడు. ఆ పూట వుండి తెల్లవారి దున్నపోతును తోలుకొచ్చేవరకు, శాయిరోళ్లు వూళ్ళోలేరు. సరే రేపు మాపూగో యేదో తగులపెడుదాం అని అట్టనే పనిమీద పోయిన్నను. పాటుకాలం కనుక తీరికవుండి సచ్చిందికాదు: యేడెనిమిది రోజులదాకా వాడితో చెప్పనేలేదు.

ఒకనాడు జవాను యేదో పనిమీద బజారున పోతో- 'ఈ దున్నపోతు యెక్కడిది' అని అడిగి, పోయి పంతులుచెవులో వూదిండుగామాలు. యింకేముంది- ఆపూట అరక ఆపుచేసి దున్నపోతును నాకా దగ్గరికి తోలుకపోయి, 'యిన్నాళ్ళనుంచి మాసూలు కట్టకుండా వుంచుకున్న' వని కాయిదం మీద రాసుకొని, 'మీరు తోలుకరమ్మన్నప్పుడు తోలుకొస్తాం' అని మా అన్నను జమానతు తీసుకొని వదిలిపెట్టిండు. అట్టట్టా అరకలు సాగినయి. దున్ని నాలుగు మొలకలు చల్లుకున్నం. నెల్లాల్లకల్లా 'శాయిరి అమీను వచ్చిండు, మీ దున్నపోతును తోలుక ర'మ్మని జవాను చెబితే దాన్ని నాకా ముంతరికి తోలుకపోయిన.

'అదేంకో తిరగేసి మల్లేసి రెండుమూడు కాగిదాలు చెడరాసిండు. దున్నపోతును యేలం పాడుమన్నడు. 'ఓరి నీ అన్నాయం కాలిపోను. నెల్లాల్లు వుండి పొయ్యే దున్నపోతును యేలం పాడమంటవేమయ్యా?' అని నేను, మా అన్న యెంతో బతిమాలాడినం. ఆడు యింటే గదా. 'కాదు కక్కసం నీవు తోలుకొచ్చిన నాడే మాసూలు కట్టలేదు కనుక యేలం పాడ' మన్నాడు. నా కడుపు తరుక్కుపోయింది. గుడ్లుతేలేసి, నోరెళ్ళబెట్టి సూస్తుండగనే యేలంపాట మొదలేసిన్రు. 'యీ అన్యాయపు పాటకురా' మని వూళ్ళో వాళ్ళంతా వూరోక్క బట్టిగాని, ముప్పయ్యయిదు - సలబై రూపాయిలకు తక్కువ దున్నపోతు కాదు అది. సరే తర్వాత మాద్దామని మాఅన్న యిరువై రూపాయలకు పాట పాడిండు. ఆయన ఒకరసుంటి మడిసి కాడు. కాస్త మెత్తటి మనసుగల్లోడు. యేలంపాట

సంగతి యిని నా పెండ్లం యేడ్సుకుంటా వురికొచ్చింది. అయితే యెవడింటాడు. కోపం పట్టలేక, 'నీ శాయిరి ముదనష్టంగాను, యెన్నికొంపలు పాడుచేస్తార్రా' అని తిట్టుకుంటా మూడుదోసిళ్ళ మన్నుపోసి పోయింది.

ఇట్టాంటిది యిది వక్కటేకాదు. లచ్చాతోంబై అన్నాయాలు జరుగుతై. కూరగాయలు అమ్మొస్తే కూలేసిరి. గాజులోళ్లు వూళ్ళోకొచ్చేది భయమాయె. యెవరైన తక్కెడు మిరపకాయలు తెచ్చుకుంటె మాసూలు తప్పదాయె. యెరుకలోడు తట్టలుతెచ్చి అమ్ముకుంటె లంచాలాయె. అందాక యెందుకు, పొరుగూరి చాకలోళ్ళను చవుడు వూడ్సుక పోనిస్తార, వాళ్ళ పాడుగాను. గుళ్ళపూడి ఆసామికి మావూరు సివార్లో కొంత చలకవుంది. శాయిరోరుకి చెప్పకుండనే జొన్నచేను కోయించి గూడేసుకున్నాడు అది తెలువంగనే-'మాకు చెప్పకుండ కోసి గూడేసినవు; యెంతచొప్ప ఆవలికి దాటిచ్చినవో, పైకి రిపోటు రాయాలి' అని జొన్నగూటిమీద ముద్దరవేసిన్రు, ఒకేడు. పాపం ఆ యాసామి కాళ్ళరిగిందాకా తిరిగి అడిగినంత డబ్బు పారేసి ఆ గూడు కాస్త యేరించుకపోయిండు. అబ్బ, అబ్బ. అందరం యిసికి యేసారినం, యీ ముదనష్టపు శాయిరోళ్ళతోటి. అయితే మాత్తరం యెవడికివాడే మొత్తుకుండేది, వూరుకునేది. అంతే.

పోయినసీతాకాలం. జొన్న చేలుగుగ్గిళ్ళపరువున వున్నయి. యేసంగి దుక్కులు దున్ని ఆట్టే నాట్లు ఆలుకుళ్లు మొదలుపెట్టినం. చుట్టుపక్కవూళ్లె సంఘాలు పెడుతున్నరు, సభలు చెబుతున్నరని వచ్చి పొయ్యేవాళ్లు చెబుతుంటే యింటుండేవాళ్ళం. వకనాడు మా వూరికికూడా సంఘపోరు వచ్చిన్రు. నైజాం సర్కారు వున్నంతకాలం మన కన్ని కష్టాలేవుంటయి. లేవీ గింజలు, యెట్టిపని, పటేలు-పట్వారీలు, గిర్దావర్ల లంచాలు, శాయిరోళ్ళ బాధలు యివన్నీ పోవాలంటే మనం అందరం ఒక్క తాటిమీద నడిచి సర్కారును యెదురించాలె. అట్ల యెదురించి పోట్లాడిన నాడే యీ సర్కారుపోయి, మనంకోరుకున్న సర్కారువస్తది. సర్కారువస్తేగాని, మన కష్టాలుపోవు. యీ సర్కారును యెదురించాల్నంటే ప్రాణాలకైనా లెక్కపెట్టకుండా నిలబడాలె.' అని యిల్లాంటి మాటలు యింకా యెన్నో చెప్పిన్రు. నిజమే—అందరం ఒక్క తాటిమీద నడవాలని ఒకళ్ళ మొకం ఒకళ్ళం చూసుకున్నం. 'చూస్తే యేం లాభం, చేస్తే లాభం' అని మా చిన్నయ్యకొడుకు అన్నడు. నిజమంటే నిజమనుకున్నం.

మొట్టమొదట శాయిరీ దస్తరాన్ని తగులపెట్టాలనుకున్నాం. రెండు జాములయ్యేల్లి. అప్పుడేపొద్దు అడ్డం తిరుగుతుండది. అందరం గబగబా లేచినం. 'కాంగ్రెసుకు జై, కమ్యూనిస్టుపార్టీకి జై, ఆంధ్ర మహాసభకు జై' అని వూరంత మోగేటట్లు కేకలేసినం. పదండర్రా అని శాయిరీ నాకా దోవ బట్టినం. వక్కడా యిద్దరా. రెండు వందల యాభైమందిమి, జై అంటె జై అని. బజార్లు పట్టుచాల్లేదనుకో.

నడివూళ్లె చింతచెట్టు కాడినుంచి శాయిరీ నాకాదనుక చీమలబారు పాకినట్లుంది. మేం గోల చేసుకుంటా పోతుంటే చప్పుడు విన్నారేమో-శాయిరీపంతులు, జవాను నాకా విడిచిపెట్టి తోట పెరళ్ళలోనుంచి పడి అదే ఉరుకుడు. పైమీది గుడ్డలు జారిపోయినా అందుకున్నరా? తిరిగి చూస్తే ఒట్టు. అంతకుముందు యెంతలావటోడి మీదికైనా ఊకమీది రోకలాలె లేసేవాళ్ళు, కుక్కచావు నక్కచావని ఉరికిన్రు.

దస్తరంలోపల పెట్టెతలుపుకు తాళంవేసివుంది. 'సూస్తరేం, కమ్మరాయన యింటికాడ సుత్తె తేండశా' అన్నడు పెద్దరైతు గుడిపాటియెంకయ్య. యెంటనే వురికి సుత్తెతీసుకొచ్చి కొడుతుంటె ఓ భంగిన పగులలేదు తాళం. 'దీని తల్లి కడుపు కాల, వాటంగా తగల్నియ్యశా', అని వాటమైనవి నాలుగుదెబ్బలేసేవరకు తునాతునకలైపోయింది. తలుపు బార్లాతీసి వకడిమీదపడి వకళ్ళం లోపల జొరబడ్డం. ఆ తోపిడికి ముసలోళ్ళు పిల్లగాళ్ళు నలిగిపోయిన్రు. మడిసి కొక కాయిదం రాలేదు. అన్నీ తెచ్చి బయట కుప్పేసినం. దస్తరం పెట్టేవి చక్కపెట్టె ఒకటుంది. నలుగురం మడుసులం పట్టి బయటికి తీసుకొచ్చినం. గోడలకు అయిదారు పటాలువున్నయి. వాటిచట్టాలు తునకలుతునకలు యిరిసిపడేసినం. అన్నీ పోగేస్తె మోతజల్లెడు కాయిదా లున్నయి. 'సూస్తరేం పెట్టండశా నిప్పు' అన్నాడు, దావులూరి చన్నయ్య. అనేది అంటుండగనే అగ్గిపుల్ల గీకి అంటించిండు, అబ్దుల్ కరీం

పెద్దకొడుకు బాఘుమియ్యా. యికసూసుకో, ఎగ ధగధగ ఒకటేమంట. 'దీనిమీద నశ, మన గొడ్లమాసూలు లెక్కరానేది' అని యెర్రబొక్కను యెగదోసిందు మావోళ్ళ చివరాములు. 'కాలనియ్యి-పీటి పాడైపోను, యిన్నాళ్ళనుంచి మన కొంపలు నాశనంచేసినయి' అని సుద్దగాని రాములు అన్నడు. కోమటోరిపిల్లగాడు, పదేండ్లుంటయి, అక్కడ నిలబడి డబ్బులేసేగోతం సంచి పట్టుకొని తిరిగేసి మర్లేసి సూస్తుండు. 'యేం సీతయ్యా-పసుపు, యెల్లిపాయలు పోసుకుంటానికి పని కొస్తదని సూస్తుండవా- సంచిని పడేయి మంటల, ఆ పాపపు సొమ్ము మన కొంపల్లవున్నా కొడికొట్టుకుంటుంది' అని చేతుల సంచిని గుంజి, మంటల పారేసిండు గోగుల మల్లయ్య. సందూక కాస్త గట్టిది. కాబట్టి అది మాత్తరం కాస్త ఆలశంగా కాలింది. ఆ బూడిదను ఆడ వదలిబెట్టి జైజై అనుకుంటా పెద్ద బజారునపడి యెవళ్ళ యిండ్లకు వాళ్ళం పోయినం.

మరి పారిపోయిన పంతు లేం చెప్పిండో, పటేలు రిపోటే రాసిండో కాని-నాలుగోనాడు మోట లేసుకొని యిరువైమంది 'రిజోడు' పోలీసులు వచ్చిండ్రు. వస్తేమాత్తరం యేముంది. మంచి మంచి బట్టలు, బిందెలు, సర్వలు అన్నీ అంతకు ముందే గుళ్ళపూడికి, గోగ్గూరపాడుకు, బిక్కనోలుకు చేరేసినం. అవి యూనియన్ వూళ్లాయె. అక్కడికి పోలీసులు పొయ్యే భయంలేదు. వూళ్లెకువచ్చిన పోలీసులు పటేలును యెంటబెట్టుకొని యిండ్లన్ని గాలిచ్చిండ్రు. వండుకతినే కుండలు, కంచాలు పగులగొట్టిండ్రు. నుక్క మంచాలు, బట్టలు, కాయిదాలు, దస్తరాలు అన్నీ మోయించుకపోయి శాయిరి నాకా ముందర పడేయించిండ్రు. రెండుమూడు బస్తాల వేరు సెనగకాయ, బస్తా జొన్నలుకూడ ఆ పోగులనే పోయించిండ్రు. వూళ్లో మందిని, పిల్ల బీరుపోకుండా, అందరిని నాకా ముందరికి నెట్టుక పోయిండ్రు. ఆ రాసిచుట్టు గుంపుగా నిలబెట్టిండ్రు. ఆ పోలీసుల్లో ఒకడు మరీవుత్తకోతి మొకపోడు' అరే, పోయి ఆయింటికి, యింత చొప్ప గుంజుకరా' అని ఒక మాదిగోణ్ణి నాకా యెదురుగావున్న యింటి చొప్ప తెమ్మన్నడు. వాడు భయానికి పోయి ఒక మూలకు యింత గుంజితెచ్చి, 'యికపట్టు. నీపాడె కొమ్మున కొట్టుకో,' అని ఆడ పడేసిండు. అప్పుడే యింకో రాగిమిసాల పోలీసు అగ్గిపుల్ల గీసి దానికి అంటుపెట్టిండు. బరబర మండుతుంటే- 'శాయిరీ కాయిదాలు యిట్లనేతగులబెట్టిండ్రు కాదు. చూడుర మీ సొమ్మంత ఎట్టా కాలుతుందో,' అని ఎకసెక్కంగా మాట్లాడిండు. జొన్నలు పేలాలై దేశమంతటా చిల్లిపడుతున్నయి. యేరు సెనగకాయ కమూరిల్లుతూ కాలుతున్నది. అట్లా కాలుతుంటే మా కడుపులు మండిపోయినయి. వీళ్ళని యీ మంటల యేసినా పాపంలేదు అనుకున్నాం కాని యేంజేస్తం. వాళ్ళకేమొ తుపాకులాయె. మాకేమి లేవాయె. మంట చుట్టారి నంక ఎర్రటి ముద్దమొకపు పోలీసు (జమాదారంట)-'సూసిండ్రా, యీ మంట. మళ్ళీ సంగం, భంగం నేకున్నా అంటె మీ వూరంతా యిట్లా కాలబెట్టి పారేస్తాం. కబర్దార్' అన్నడు. 'ఏడిసినవులే, అన్ని నీవు కాలబెట్టిన వూళ్లే' అని ఒక సాకలోరి పిల్లగాడు అన్నడు. 'యీళ్లంతా యిండ్లల్లో జొరబడ్డప్పుడు మనమే నిప్పు పెట్టాల్సిందిరా' అన్నడు, ఒక గొల్లాయన. 'అంతమాత్తరం తుపాకి చేతు లుంటెనా! నువ్వు కాదు. నీ జేజేమ్మవూళ్లోకి వచ్చేది చూయింతును' అన్నడు ముతురాస మల్లయ్య. 'కాలితె కాలిన యిలే. శాయిరీభాద అయితె తప్పిందిరా' అన్నడు, గాజుల యీరమల్లు. మేము మొనగాళ్ళం అన్నట్లు పోలీసోళ్లు గొమ్మలు యిరుసుకొని యెల్లిపోయిండ్రు. ఉత్త కొంటెకారు మనుసులు. దానింకా జీవాలు మేస్తుంటె, పోతపోతా యిత్తనపు గొర్రెపోతును యెత్తుకపోయిండ్రు. గొల్లాయన యెంత మొత్తుకున్నా యిడువ లేదంట. అసలు వాళ్ళకు హద్దు మర్యాద చెప్పెటోడు వుంటెనా?

అది అట్లా జరిగింది. ఆనాటినుంచి శాయిరోళ్లు కనపడితే ఒట్టు. అవతల వూళ్లెకు పోయి సెనగకాయ అమ్ముకున్నా, బట్టబాతలు కొనుక్కున్నా, ఉప్పు మిరపకాయ తెచ్చుకున్నా - ఒకటేంది, సమస్తము, యేది తెచ్చుకున్నా, తీసుకపోయినా అడిగేనాథు డుంటెనా? అంతా మా యిష్టము తోటే జరిగింది. అంతకు ముందు చీటికిమాటికి శాయిరి ముందర మూటలు దింపడం, అయి అన్నీ యిప్పి సూపించడం, వాళ్ళను బతిమలాడడం, డబ్బులియ్యడం యెక్కడపోయినయో? పీడే వదిలింది. ఈ ఏడెనిమిది నెల్లనుంచి నిమ్మలంగా ఉంటుండం.